# చేపకత... చీమకత...

అనగా అనగా ఒక చేప. వయసులో ఆ చేప స్వతంత్ర భారతదేశ మంతటి చిన్నది. ఎండలో ఎండా కాలమంతా ఎండవేసినా ఎండలేదు. కుళ్ళిపోయింది. వలపన్ని పట్టితెస్తే చివరకి ఎందుకూ పనికి రాకుండా పోయింది. కంపు కొట్టున్నది. దాంతో చుట్టూ వాతావరణమంతా చెడిపోయింది.

కొందరు ప్రెస్ రిపోర్టర్స్ వచ్చి ఆ చేపని చూసారు.

ఆ చేపకి మందుల్లేవు. హాస్పిటల్స్‌లో బెడ్స్ ఖాళీ లేవు. డాక్టర్లు కూడా లేరు.

చేపా చేపా ఎందుకు ఎండలేదని ఆ రిపోర్టర్స్ ఆ చేపని అడిగారు.

ఈ ఇరవై రెండేళ్ల కాలంలో తనసంగతి ఎవ్వరూ ఎన్నడూ పట్టించుకోలేదని చేప వారికి చెప్పింది. అసలు గాలిలోకి వెలుగులోకి తనను తీసుకురాలేదని, చీకటిలో జైళ్లల్లో ఉంచారని మొరపెట్టుకుంది. చేప వేలెత్తి రెల్లుదుబ్బును చూపింది.

రెల్లుదుబ్బుకు రంపాల్లాంటి లెక్కలేనన్ని చేతులున్నాయి. అవి బాయినేట్‌ల్లా పొడుచుకు నుంచున్నాయి. పదునుగా మెరుస్తున్నాయి. ఆ రెల్లుదుబ్బు తనచేతుల్లో శాసనాలని పెట్టుకుంది. ఆ చేతుల్తోనే అది మతాలని పట్టుకుంది. ఆ చేతుల్తోనే అది దేముళ్లని పూజిస్తున్నది. అది ఆ చేతుల్తో బడాపెట్టుబడి దారుల ఇళ్లముందు స్టెన్‌గన్‌లతో కాపలా కాస్తున్నది. ఆ చేతుల్తో అది భూస్వాములకు వారసత్వపు హక్కులను ప్రసాదిస్తున్నది. ఆ చేతుల్తో అది దళారుల పక్షాన కోర్టులో తీర్పులు రాస్తున్నది. ఆ చేతుల్తోనే దేశంలో పర్యటనకు వచ్చిన బడా సామ్రాజ్యవాదుల మెడల్లో పూలహారాలను వేస్తున్నది.

వీచిన తుఫాన్ గాలులకు మహావృక్షాలు కూలిపోయినా ఆ రెల్లుదుబ్బు నేలకి వొరగలేదు. దాని రాజ్యాంగం వేళ్లతో మట్టిలో బలమైన పునాదులు తవ్వింది. తన చుట్టుప్రక్కలెక్కడా మానవత్వపు మొక్కలు చిగిరించకుండా అధికారాన్ని చెలాయించుకొస్తున్నది.

'రెల్లు దుబ్బూ రెల్లు దుబ్బూ చేపకి ఎందుకడ్డమొచ్చావు?' అని విలేఖర్లు అడిగారు. ఒక విదేశీ పత్రికా విలేఖరి చాలా ఫొటోలు తీసాడు.

'నేను అడ్డం రావడ మేమిటి? నా నీడలో దాన్ని తెచ్చి వేసారు.' అని 'నా గుడారంలో

తల పెట్టింది. నా అనుమతి లేకుండా వచ్చింది' అని విషయాన్ని తారుమారు చేయటం మొదలుపెట్టింది రెల్లుదుబ్బు.

మరో విలేఖరి 'వీత్నాంలో అమెరికా ప్రవేశించినట్టుగా -' అని ఇంకా ఏదో చెప్పబోతుంటే సగంలో అందుకుని

'ఎంత మాత్రమూ కాదు' అని తోసిపుచ్చింది, రెల్లుదుబ్బు.

'అరబ్ దేశాల్లోకి ఇజ్రాల్ వచ్చినట్టుగా కాదా?' అని అదే విలేఖరి మళ్లీ అడిగాడు.

రెల్లు దుబ్బు ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. మౌనం వహించింది. కొంతసేపటి తర్వాత రెల్లుదుబ్బు విషయాన్ని మార్చింది. 'వెళ్లి ఆవు నడగండి' అని ముఖం తిప్పుకుంది.

నీరసంగా పండుకొని ఉన్న గోధుమరంగు ఆవు దగ్గరకు వచ్చి గుమిగూడారు విలేఖరులు.

ఆవు అమాయకంగా ఉంది. రాటకి కట్టిపడేశారు. తిండిలేదు. ఎముకల గూడులా ఉంది. ఆ రాటనించి తెంచుకొని పారిపోవాలని గింజుకుంది. కాని రాట బలంగా ఉంది. మెడకి ఉన్న పలుపు ఇంకా బలంగా ఉంది. ఎంత ప్రయత్నించినా మెడకోసుకుపోతున్నదే తప్పించి రాట కదలటం లేదు. పలుపు తెగటం లేదు.

ఆవు ఆకలితో నిస్సహాయంగా పండుకుని ఉన్నది. విలేఖరుల గొడవకి కళ్లు తెరిచింది.

'మీరు నిరాహారదీక్ష చేస్తున్నారటకదా?ఎందుకు?' అని ఒకాయన అడిగాడు. విలేఖరులు అక్కడకు వెళ్లే పని ఒకటయితే చేసే పనులు పది.

'అవును. తిండి పెట్టమని నిరాహార దీక్ష చేస్తున్నాను.'

నవ్వారు కొందరు. తిండికోసం నిరాహార దీక్ష పూనుకోవటం బావుందనుకున్నారు.

'తిండి పెట్టమని మళ్లీ యాచించటం దేనికి? పంట పొల్లాల్లోకి పోయి తిని రాక.... తెచ్చుకోక.'

'అదెట్లా అవుతుంది నాయనలారా. పైన పెద్దవాడున్నాడు. వాడిచేతితోనే అంతా జరగాలి. వాడి దయగలిగి.'

'మీ అంతట మీరు మీ శక్తితో సాధించుకోలేరన్నమాట.'

'ఎక్కడ అడుగుపెట్టే ఎవరూరుకుంటారు? ఎక్కడ అడుగు పెట్టినా అది ఎవరిదో ఒకరి ఆస్తి అయ్యే ఉంటుంది. ధైర్యంగా అడుగు వేసామూ అంటే అది బంజరు దొడ్డికి తిన్నగా తీసుకుపోతుందే తప్ప.'

'ఆ రెల్లుదుబ్బులున్నాయి కదా వాటిని తినొచ్చుకదా? మీరెందుకు వాటిని తినేయలేదు.'

'దాన్ని నేను తినలేను. అది లేతగా ఉంటే ఏమో! అది బలిసింది. దాని రేకులు ఇప్పుడు రంపాల్లాగా ఉన్నాయి నా నాలిక పెదాలు తెగిపోయి రక్తం కారుతుంది తప్పించి దాన్ని తినటం నాకు చేతకాదు.'

'కోసి ముక్కలు ముక్కలు చేసి తినొచ్చుకదా'

'అమ్మో రక్తం! నా అంతరాత్మ ఒప్పుకోదు' అంది ఆవు.

'మీ ఎరువుతో తెగ బలుస్తున్నది కదా. మీరు ఇవ్వటం మానేస్తే అదే చస్తుంది తిండిలేక' అన్నాడు ఇంకో విలేఖరి.

'నేను చేయగలుగింది ఏమీలేదు. పోయి మా కాపరినడగండి. నేను నీరసంగా ఉన్నాను. క్షమించండి నన్ను ఇంక అధికంగా మాటాడించకండి' అంది.

* * *

తనవేపు వస్తున్న విలేఖర్లను చూడటంతోనే చాల మర్యాద చేసాడు ఆవుల కాపరి. వినమ్రంగా చూసాడు. ఆ ప్రవర్తన చూసి కొందరు కాపరి చాలామంచివాడు, అమాయకుడు అన్న భావాన్ని ఏర్పరచుకున్నారు. కాపరి చాలా హుందాగా ఉన్నాడు. యువకుడు.

'ఆ ఆవును కట్టిపడేశారట తమరు. అంతా అనుకుంటున్నారు' అన్నాడు స్వదేశీ బడా ఆంగ్లదిన పత్రికా ప్రతినిధి.

కాపరి తలపాగాని సర్దుకున్నాడు. మీసాలని దువ్వుకున్నాడు. చివరకు అన్నాడు.

'ఆవుల్ని కట్టి పడేయకపోతే విడిచేయమంటారా? ఈ పంటలన్నీ ఏ మవుతాయి. ఒక్క గింజన్నా గోడౌన్స్‌లోకి వస్తుందా? బ్యాంకులూ, స్టాక్‌ఎక్స్ఛేంజీలూ మన గలుగుతాయా? ఆవు మీద జాలి చూపిస్తున్నట్టున్నారు మీరు. కొంచెం కట్టువిప్పి విడిచి పెట్టి చూడండి. మీకే తెలుస్తుంది. ఈ పంటంతా తనదే అంటుంది. ఎదురడ్డమొచ్చినా వాడినెల్లా పొడిచి చీలుస్తుంది. అది పశువు సార్, దాని బలము తెలుసు గనకనే రాటకి కట్టాము. అది క్రూర మృగం అని తెలిస్తే బోనులో పెట్టే వాళ్లం. గడ్డిదుబ్బును తినమని విడిచిపెట్టే పంటల్ని తినేయకుండా ఊరుకుంటుందా? అంచేత'

'ఆవును గూర్చి తమరు అట్లా మాట్లాడటం బాగాలేదు. అది సాధుజంతువు. తన ఆకలి తీరిందంటే దానికి అమృతం పెట్టినా అక్కర్లేదు. రేపటి కోసం ఏమి దాచుకోదు' అన్నాడు ఇంకో విలేఖరి మధ్యలో తలదూర్చి.

'లాఠీలు, తుపాకులు, కోర్టులు, జైళ్లు ఉన్నాయి గనకనే అవి సాధువుగా కనపడుతున్నాయి. మంచితనమంతా కనిపిస్తున్నది. ఈ మంచితనమంతా చూసిన తర్వాతనే కొన్ని రాటలూ, కొన్ని కర్రలూ పట్టుకొచ్చింది. పైసలు మిగిలికాదు వాటిని తెచ్చింది' అన్నాడు పసులకాపరి. భుజం మీది తువ్వాలునీ, చంకలోని కర్రనీ సర్దుకున్నాడు.

'ఇకచాలు, నన్నంటే ఏం లాభం? నేను కూడా మూడుపూటల తిండికి ఆశపడి ఇది బావుందనుకున్నాను. ఈ కర్రను చంకను పెట్టుకున్నాను. పోయి నాకు కూడుపెట్టున్న అవ్వని అడగండి. ఆ అవ్వే చెపుతుంది.'

* * *

పార్లమెంటు సభ్యులంత హోదాతో వచ్చారు విలేఖర్లు అవ్వదగ్గరికి.

అవ్వ ఇంటిబయట నెత్తిన చేతులు పెట్టుకుని కూచుని ఉంది. ఆ వాకిట్లో, ఇంట్లో చిందరవందరగా చాలా వస్తువులు పడున్నాయి. పెట్రోలు డబ్బాలు, అగ్గిపెట్టెలు, నెత్తురులో మునిగిన మతాలకత్తులు, సత్యాగ్రహాలబోర్డులు, నిరాహారదీక్షల బేనర్లు, నాటుబాంబులు, చించేసిన జెండాలు, కాల్చేసిన చరిత్ర గ్రంథాలు, కాళ్లు విరిగిన కుర్చీలు, నేలవాలిన మైకులు, తెగి వేలాడుతున్న ఎలెక్ట్రిక్ తీగెలు, విరిగి ముక్కలయిన టెలిఫోన్‌లు, చదరంగం బోర్డులు, లాటరీ టిక్కెట్లు, విదేశీ కరెన్సీలు, తెంచిన తోరణాలు, నేలకేసి కొట్టిన ఎలెక్ట్రిక్ దీపాల గాజు పెంకులు, పేడపులిమిన దేశీయ నాయకుల వాల్‌పోస్టర్లు.

అవ్వ నూడ్‌గా ఉంది. దేశాభిమానం చీరనన్నా కట్టుకోలేదు.

'అవ్వా ఆ పసులకాపరికి నీవు అన్నం పెట్టలేదట' అన్నాడు ఒక అంతర్జాతీయ గుత్త పెట్టుబడిదారి పత్రికా విలేఖరి. ఇంటర్వ్యూ ఆరంభించాలని.

'అవ్వా అవ్వా పసులకాపరికి ఎందుకు అన్నం పెట్టలేదు?' అని జాతీయవాది పత్రికా విలేఖరి అవ్వను ప్రేమతో అడిగాడు.

కొంతసేపు గొడవపడ్డారు. వాళ్లల్లో ఒక స్టెనో తనురాసింది చివరకి చదివాడు.

'చేప ఎండక పోవటానికి నువ్వు కారణం అంటున్నారు. నీవేమంటావు?' అన్నాడు విలేఖర్లలో ఒక పెద్దమనిషి.

అవ్వ రొమాంటిక్‌గా ఉంది. గ్లామర్ ఉట్టిపడుతున్నది. దాంతో సమ్మోహితులయిపోయారు. ఫోటోగ్రాఫర్స్ చుట్టుముట్టేసారు. ఒక జర్నలిస్ట్ అవ్వ స్కెచెస్ వేయటం మొదలు పెట్టాడు.

మళ్లీ అడిగాడు 'ఆవులకాపరి ఆవును మేతకు విడవ లేదటకదా ఎందుకు?' అని ఒక అతివాది పత్రికా విలేఖరి ప్రశ్న.

నోరు మెదపకుండా, కళ్లతో కనీసం చూడనన్నా చూడకుండా, ఎడంచేతి చూపుడు వేలుతో చంటిపాపని చూపింది అవ్వ.

అక్కడ నుండి ఎవ్వరూ కదల్లేదు. అవ్వ ఎదుట కూచున్నారు. అవ్వ మాటాడుతుందని ఎదురు చూస్తున్నారు. సినిమాల్లో ముద్దులుండాలా వద్దా అన్న ప్రశ్న ఒకాయన తయారుచేసుకున్నాడు. ఒక ముసలి రిపోర్టర్ మాత్రం అక్కణించి కదిలాడు.

* * *

చంటిపాప ముఖాన కళ్లులేవు. వికారంగా కనిపించింది. గుడ్డి కళ్లన్నా ఉంటే బావుండును. ఆ కళ్లున్న భాగాన ముఖంలో బుగ్గఎముక ఎత్తుగా ఉంది. అంతే. కనుబొమలు కూడాలేవు. మెలికలు తిరిగిన చెట్టు వేళ్లలా వొట్టి ఊచకాళ్లు. వొళ్లంతా రసి కారుతున్నది. చేతివేళ్లు తెగిపోయాయి. కుష్టు. చూస్తే పాపలా కనిపించదు. మరుగుజ్జులా ఉంది.

'నీ వయసెంత?' అని అడిగాడు ఒక విలేఖరి. మొదట వయసు తెలిస్తే ఆరోగ్యం సంగతి నిర్ధారణ చేసుకోవచ్చనిపించింది ఆ విలేఖరికి.

చెప్పలేదు.

'నీ పుట్టిన్నేదీ చెప్పు.'

'రిపబ్లిక్‌డే నాడు పుట్టినా' అంది.

'మరి ఇన్నేళ్లయిందే నీ ఆరోగ్యం ఇలా ఉందేం? మరుగుజ్జువా?' అన్నాడు.

'నా తల్లీ తండ్రీ మరుగుజ్జులు. నేను కాకేమవుతాను. వాళ్లు యుగాలుగా బిచ్చగాళ్లు. నా తల్లీ తండ్రి కూడా రోగిష్టులే. నా తల్లికి కాళ్లు లేవు. తండ్రికి కళ్లు లేవు. వాళ్ల సంతానాన్ని.'

'అవ్వ నీ తల్లి కాదా?'

రోగాల పుట్ట నోరు కదపలేదు.

'సరే ఎందుకేడుస్తున్నావ్ మరి?'

దగ్గర్లోనే ఉన్న చీమని చూపింది.

కథా నిలయం
శ్రీకాకుళం

* * *

'చీమా చీమా పాపాయిని ఎందుకు కుట్టావ్?' అన్నాడు. ప్రభుత్వమంత విరాటాకారంతో చిన్నారి చీమ ముందు నుంచుని ఆ విలేఖరి.

చీమ మొదట ఆ విలేఖరి మాటలు చెవినిపెట్టుకోలేదు. మళ్లా దారికడ్డమొచ్చి అడిగేసరికి 'నువ్వెవడివి?' అని కసిరి అడిగింది.

చీమని భయపెట్టి హడలెత్తించేయాలనిపించింది విలేఖరికి.

'నేను స్వేచ్ఛని, పత్రికా స్వేచ్ఛని' అన్నాడు.

'అయితే మీదే దేశం?'

స్వేచ్ఛకి విశ్వమే ఒక దేశం అని చెప్పాలనుకున్నాడు గాని పౌరసత్వాన్ని శంకిస్తుందేమోనని అనుమానం కలిగి 'భారతదేశం' అన్నాడు.

'మీ దేశం విదేశాలను అడుక్కుంటున్నదంట కదా ఎందుకు? పేదరికం ఎక్కువయిందంట కదా ఎందుకు? ధరలు పెరిగాయంట. అధికార రాజకీయ పక్షం

సగందేశంలో చచ్చిందంట కదా ఎందుకు? ఇవన్నీ ఎందుకు ఎందుకు?'

పశ్నలు వేయాలన్న రీవీతోనే వచ్చాడుగాని ఎదురు ప్రశ్నలకు సిద్ధపడి రాలేదు ఆ విలేఖరి.

'రాజ భరణాలు రద్దు చేయలేదు ఎందుకు? విదేశీ బ్యాంకులు జాతీయం చేయలేదు ఎందుకు? బడా పారిశ్రామిక వేత్తల నుండి ఆదాయం పన్ను వసూలు చేయటంలేదు ఎందుకు? స్వేచ్ఛాజీ చెప్పండి.'

ప్రశ్న కొత్తదయేసరికి భాషకూడా అర్థంకాని ఐయ్యేఎస్ ఆఫీసర్‌లాగ నుంచున్నాడు ఆ విలేఖరి.

'స్వేచ్ఛాజీ' ప్రజాస్వామ్య రాజ్యాంగం అని ఒక నాలుకతో చెపుతూనే రాచరికాన్ని ఎట్లా సమర్థిస్తున్నారు? పెదవి విప్పరేం? మీ పవిత్ర స్వాతంత్ర్యం ఏమయింది? మీ ప్రాథమిక హక్కులేమయ్యాయి?'

'స్వేచ్ఛాజీ మీది లౌకిక రాజ్యాంగ వ్యవస్థ అన్నారటకదా, మొన్నటి అహమ్మదాబాద్ ఏ రాజ్యాంగ వ్యవస్థ కుట్ర ఫలితం? అక్కడ అల్పసంఖ్యాకులు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకొని దేశం నలుదిక్కులా పారిపోయారంట ఏ మతస్వాతంత్ర్యంని గుర్తించి? ఏ మతాతీత పరిపాలనకు బలయి?'

చిన్న చీమ ప్రశ్నలు చెప్పు దెబ్బల్లా తగుల్తుంటే రాతి బొమ్మలాగ నుంచుండిపోయాడు ఆ విలేఖరి.

'నీవు ఏమి సమాధానం చెప్పలేవు నాకుతెలుసు. నీతో నీ డాలర్ మిత్రులు రాలేదు. వాళ్లొస్తే చెప్పేవాళ్లు. వాళ్లు వొస్తే నీకు గొంతువిచ్చేది. మీ బలం చూపటానికి నన్ను అమాంతం కాల రాసేయ గలిగేవారు. ఎన్‌కౌంటర్ చేసి పోరాటంలో మరణించాడని ప్రచారం చేసి జనం చేత నమ్మించగలిగేవారు. బాంబుల్నీ, టాంకుల్నీ తెచ్చి కాల్చేసి తొక్కించేయగలిగేవారు. కాని నాకు ఆ భయంలేదు. నా శత్రువు యొక్క క్రూరత్వమంతా నాకు తెలుసు. నాకేకాదు, నా జాతికంతా తెలుసు. నా జాతికి ఏ పిరికితనం లేదు. భయంలేదు. బానిసత్వం సహించదు.'

'ఎందుకు కుట్టావని అడిగావు కదా? విను. అది నా జీవిత ప్రధాన అవసరాలని దోచుకోవటానికి కుట్రచేస్తున్నది. ఇంతకుముందునుంచి అది చేస్తున్నపనే ఆ కుట్ర, నిరంతరంగా. ఆ తేనెటీగల్నడుగు అవి చెప్తాయి. ఎవరా తేనె పిండుకుని ఎత్తుకు పోతున్నారో? ఆ పాముల్ని పట్టి బోనులో నిలబెట్టి అడుగు. ఇప్పుడవి ఉంటున్న మేడలు చెమటోడ్చి కట్టుకున్నాయేమో. కలకాలం పాపం పుణ్యం దేవుడు మతం అని మాటలతో మోసపుచ్చారు. అందుకే నా హక్కుల్లో ఎవరు జోక్యం కలిగించుకున్నా సహించేది లేదు.

క్షమించేదిలేదు. అందరికీ సమానత ఉన్న సమాజంలో బతకాలి లేదా అమరవీరులుగా నన్నా మిగిలాలి. అంతే తప్పించి బానిసలుగా, నంగినంగిగా అడుక్కుంటూ బతికేదిలేదు. నన్ను నా జాతినీ తరతరాలుగా క్రూరంగా అమానుషంగా హింసిస్తున్న, దోచుకుంటున్న నా శత్రువుతో నాకు రాజీ లేనేలేదు. ఆ రోగాల పుట్టకి మీరు కిరీటం పెట్టి పూజిస్తున్నారు. దాని రోగాలు వ్యాపించి జాతిజాతంతా నాశనమవుతున్నది. ఆ రోగాల పుట్టని చంపడానికి నా శక్తులు అక్కర్లేదు. ఆ రోగాలతో కుళ్లి దానంతటదే చస్తుంది. కాని నా అమాయకమైన జాతిని నాశనంచేయకుండా, నేను రక్షించుకోవాలి. ఆ రోగాలు ఇంకా బలిగొనకుండా, వ్యాపించకుండా ఎదురుదాడుల్తో నివారిస్తాను, నా కండరాల శక్తితో బలమైన జాతిగా కాపాడుకుంటాను' అని చెప్పింది చీమ.

*

సృజన నవంబరు *1969*